క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



రుద్రూర్: పోతంగల్ మండలం చేతన్‌నగర్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గౌతమ్‌తో కలిసి బీఆర్‌ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిరాజుద్దీన్, మండల అధ్యక్షుడు ఏజాజ్ ఖాన్, నాయకులు వల్లేపల్లి శ్రీనివాస్, లక్ష్మణ్ పటేల్, ఇస్మాయిల్, రాంబాబు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్‌లో బుధవారం సర్పంచ్ శిలారీ మంజుల సుధాకర్ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. డీపీవో జయసుధ కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, మండల వైద్యాధికారి సరిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ బల్దియా సమావేశం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బల్దియా సర్వసభ్య సమావేశం బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో 28ఎజెండా అంశాలతో పాటు అదనంగా 9ఎజెండా అంశాలు ఆమోదం పొందాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 55.40 లక్షలు, పట్టణ ప్రగతి నిధులు రూ. 2 లక్షల నిధులను పలు అభివృద్ధి పనుల కోసం కేటాయించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. వైస్ చైర్మన్ మహ్మద్ ఎత్తేశాం, కమిషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చర్చించే అంశాల వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్‌లు గంగారాం, ఇంతియాజ్, ఆమేర్, నాయకులు తోకల గంగారెడ్డి, గంగాధర్ గౌడ్, అశ్వక్ తదితరులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి



వర్ని: నర్సరీలలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని వర్ని మండల ప్రత్యేక అధికారి మధుసూదన్ సూచించారు. మండలంలోని శ్రీనగర్, జలాల్పూర్ జాకోర, అంతపూర్, పాట్టిగుట్ట గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను, నర్సరీలను, కంటి వెలుగు శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. పంచాయతీల ఆధ్వర్యంలో చేపడుతున్న నర్సరీలలో మొక్కలు చనిపోకుండా అవసరమైన ఎరువులను, నీటిని సమృద్ధిగా అందించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో బషీరుద్దీన్ ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



బాల్కొండ: ముప్కాల్‌లో బుధవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు రాములు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాల్కొండ: మండల కేంద్రంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభించారు. నాయకులు లింగాగౌడ, దాసరివెంకటేశ్, విద్యాసాగర్, పోశెట్టి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్: మండలంలోని రాయకూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను బుధవారం జెడ్పీటీసీ నరోజి గంగారాం, ఎంపీపీ సుజాతనాగేందర్‌తో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ బేగరి గంగారాం, ఉప సర్పంచ్ గంగారాం, ఎంపీటీసీ అనిల్ పటేల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసులు

బాల్కొండ: మండలంలోని నాగాపూర్ గ్రామంలో దివ్యాంగులకు, వితంతువులకు ఉచిత బస్‌పాస్‌లను బుధవారం సర్పంచ్ పెంటు లింభన్న పంపిణీ చేశారు. ఎంపీటీసీ నారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి వేళాయే!

- నేడు శ్రీరామనవమి
- ముస్తాబైన రామాలయాలు



ఎస్సారెస్పీ రామాలయంలోని సీతారాముల వారి మూలవిరాట్



ఆర్మూర్‌లోని సిద్దులగుట్టపై గల రామాలయం ఆవరణలో పందిరి వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్: రెండో భద్రాదిగా పేరు గాంచిన మెండోరా మండలంలోని ఎస్సారెస్పీలోని కోదండ రామాలయం శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబైంది. మూడురోజుల పాటు నిర్వహించనున్న నవమి ఉత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే బాల్కొండ మండల పరిధిలోని కిసాన్‌నగర్‌లో కల్యాణ రామాలయం ఉత్సవాలకు ముస్తాబైంది. నేడు ఆలయంలో సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. ముప్కాల్ మండల పరిధిలోని రెంజర్లలో కోదండ రామాలయంలో, ఆర్మూర్‌లోని సిద్దులగుట్టపై గల సీతారామ ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

సమర్థరామదాసు నడయాడిన నేల

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని శ్రీరామ మఠం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. జిల్లాలో శ్రీరామనవమి సందర్భంగా అన్ని చోట్ల సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగితే ఇక్కడ మాత్రం శ్రీరాముని జన్మదినోత్సవం నిర్వహిస్తారు. మరుసటి రోజు సీతారాముల కల్యాణం జరుగుతుంది. సమర్థ రామదాసు ప్రధాన శిష్యుడు రాజారాం రామదాసి కుటుంబీకులు ప్రతియేటా ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 3వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు శ్రీరామమఠం వంశస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రామమఠంలో శ్రీరాముడి ఆలయంతోపాటు, సమర్థ రామదాసుకు ఆలయాలు నిర్మించి, రోజు పూజలు నిర్వహిస్తారు. మఠం నిర్వహకులు శ్రీరామనవమికి ముందు గ్రామంలో భిక్షాటన చేసిన తర్వాత ఉత్సవాలను నిర్వహిస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా జన్మదిన ఉత్సవాలు నిర్వహించి బాలరాముడికి డోలాయమానం నిర్వహిస్తారు. సంతానం లేని మహిళలకు సంతానం కోసం బాలరాముడిని సందర్శిస్తారు.



ఎడపల్లిలోని శ్రీరామమఠం

భక్తుల కొంగుబంగారం కోదండ రామాలయం



శక్కర్‌నగర్ కాలనీలోని రామమందిరం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలోని కోదండ రామాలయం ఈ ప్రాంత భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయాన్ని 8నవంబర్ 1951లో నిర్మించారు. పాలరాతిపై చెక్కిన సీతారామ లక్ష్మణ విగ్రహాలను అప్పట్లో ప్రతిష్ఠించారు. భద్రాద్రిలో జరిగే రాములోరి పెళ్లిలాగే ఇక్కడ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ ఆలయంలో సీతారామ లక్ష్మణుల దేవతా విగ్రహాలు పశ్చిమాభిముఖంలో ఉండటం వల్ల రెండో భద్రాద్రిగా ఈ ఆలయం ప్రఖ్యాతిపొందింది. ప్రతియేటా శ్రీరామనవమికి వారంరోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. నేడు స్వామివార్ల కల్యాణం, శుక్రవారం రాములోరి పట్టాభిషేకం కార్యక్రమం ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

హాసాకొత్తూర్‌లో బలగం సినిమా ప్రదర్శన



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో మంగళవారం రాత్రి స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 'బలగం' సినిమాను ప్రదర్శించారు. విజేత యువజన కళా సంఘం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి సినిమాను ప్రదర్శించారు. పల్లె జీవితానికి, సహజత్వానికి దగ్గరగా ఉన్న సినిమాను తమ దగ్గరికి తీసుకువచ్చి ప్రదర్శింపజేసిన సర్పంచ్ ఏనుగు పద్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ



వేల్పూర్: మండల కేంద్రంలో బుధవారం నేషనల్ ప్రేయర్‌డే పోస్టర్లను బాల్కొండ నియోజకవర్గ క్రిస్టియన్ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు ఆవిష్కరించారు. వచ్చేనెల 12న హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రేయర్‌డే నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. దైవజనులు, విశ్వాసులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఫోరం అధ్యక్షుడు ఆనంద్‌పాల్, కన్వీనర్ మాణిక్యాల ఏలియా, ప్రధానకార్యదర్శి ఇజ్రాయెల్, ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్, పాస్టర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: చెత్తను బయట వేయకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ సూచించారు. స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఐక్యరాజ్య సమితి జనర్ అసెంబ్లీ మార్చి30న అంతర్జాతీయ జీరోవేస్ట్‌గా ప్రకటించింది. అందులో భాగంగా బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛ మషాల్ మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళ సంఘాలు, మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ఆర్మూర్‌ను స్వచ్ఛతగా ఉంచడానికి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను రోడ్లపై, కాలనీల్లో వేయకుండా మున్సిపల్ చెత్తబండిలో వేయాలన్నారు. మున్సిపల్ డీఈ భూమేష్, సానిటరిఎన్స్పెక్టర్ మహేష్, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి





రెంజల్‌లో వార్షిక ప్రణాళికను చదువుతున్న కార్యదర్శి.. కోనాసముందర్‌లో మాట్లాడుతున్న చైర్మన్

రెంజల్/ఎడపల్లి/వర్ని/కమ్మర్‌పల్లి/వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ఒకే విడతలో రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు పలు గ్రామాల్లో నిర్వహించిన సొసైటీ మహాజన సభల్లో తీర్మానాలు చేశారు. రెంజల్, ఎడపల్లి, జాకోర, కోనాసముందర్, పచ్చలనడ్కుడ సొసైటీల మహాజన సభలు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా విండో కార్యదర్శి ఆయా సొసైటీల ఆదాయ, వ్యయాలను చదివి, వినిపించారు. అనంతరం సొసైటీ సభ్యులు పలు అంశాలు, అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని చైర్మన్లు సూచించారు. ఒడ్డేపల్లి గ్రామంలో విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, విండో చైర్మన్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. సొసైటీ చైర్మన్లు మొయినోద్దీన్, పోల మల్కారెడ్డి, కృష్ణారెడ్డి, లింబారెడ్డి, సామ బాపురెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లిలో విండో చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఒడ్డెపల్లి రైతులు

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



వేల్పూర్‌లో మాట్లాడుతున్న సుధారాణి..



గోవూర్‌లో మాట్లాడుతున్న మమత



ఆలూర్‌లో చిరు ధాన్యాల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వేల్పూర్/పెర్కిట్/రుద్రూర్/ఎడపల్లి/మోర్తాడ్: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లోగల అంగన్‌వాడీ కేంద్రాలు, జీపీ కార్యాలయాల్లో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. వేల్పూర్‌లో, ఆలూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుధారాణి పాల్గొని, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. మోస్రా మండలం గోవూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత చిరుధాన్యాల్లో ఉండే పోషకాల గురించి వివరించారు. ఎడపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్ పాల్గొని, మాట్లాడారు. చిరుధాన్యాల వల్ల గర్భిణులు, బాలింతలకు అనేక పోషక పదార్థాలు లభిస్తాయన్నారు. వెల్ బేబీ షో నిర్వహించి బహుమతులు అందజేశారు. తినుబండారాల ప్రదర్శన నిర్వహించారు. మోర్తాడ్ మండలంలోని వడ్యాట్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారు తీసుకోవాల్సిన పోషక ఆహారం గురించి సూచించారు.

కస్టోడియల్ భూముల పరిశీలన



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్, జైతాపూర్ గ్రామాల పరిధిలో గల కస్టోడియల్ భూములను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. కస్టోడియల్ భూములు గత కొన్ని ఏళ్ల క్రితం రైతులు కొనుగోలు చేశారు. వాటికి పట్టాలు కూడా ఇచ్చారు. ఈ భూములను ఇతరులకు విక్రయించే క్రమంలో రిజిస్ట్రేషన్‌లు కావడం లేదు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ ఆయా భూములను పరిశీలించారు. ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ ఆకుల శేఖర్, రైతులు ఉన్నారు.

అభివృద్ధిలో బాల్కొండ వెనుకంజ

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రచారంలోనే కనిపిస్తుందని ఆచరణలో వెనుకబడి ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి విమర్శించారు. ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ ఉన్నత పాఠశాలను, వర్షాల వల్ల కోతకు గురైన రోడ్డును బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో బాత్‌రూంలు సరిగా లేవని, ప్రహరీ కూలిపోనుందని తెలిపారు. వర్షాల వల్ల రోడ్డు కోతకు గురికాగా, బాగు చేయించడంలో అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీటీసీ బొల్లి శంకర్, సర్పంచ్ సోమ పెద్ద రాజారెడ్డి, నాయకులు ఏలేటి నారాయణరెడ్డి, సురేష్‌రెడ్డి, సోమ నరేష్, దత్తు, దేవారెడ్డి, గంగా నర్సయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మిర్యాల్ పాఠశాలను పరిశీలిస్తున్న నాయకులు

క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

రెంజల్(బోధన్): మండలకేంద్రంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్షయ వ్యాధిపై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులను అందించారు. సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, జెడ్పీటీసీ విజయ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

- బార్ అసోసియేషన్..



ఆర్మూర్: ఆర్మూర్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నారెడ్డి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. కాగ అందులో ప్రధాన కార్యదర్శిగా ఐనార్ల అశోక్, ఉపాధ్యక్షుడు సెరియాల జగన్, క్యాషియర్‌గా ద్యావరశెట్టి అరుణ్, జాయింట్ సెక్రటరీగా మధుసూదన్, గ్రంథాలయ కార్యదర్శి సుకేష్, మహిళ ప్రతినిధి సవిత చక్రు ఎన్నికయ్యారు.

- బాలల పరిరక్షణ కమిటీ

వేల్పూర్: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బీమజమున అధ్యక్షతన 17 మందితో కూడిన బాలల పరిరక్షణ కమిటి ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఎంపీపీ బీమజమున చైర్మన్‌గా, ఎంపీడీవో కమలాకర్‌రావు కన్వీనర్‌గా, మిగతా వారిని సభ్యులుగా నియమిస్తూ కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంతో ఐసీడీఎస్ ఏసీడీపీవో స్పర్థ, సర్పంచులు, సూపర్‌వైజర్లు, మహిళా సమాఖ్య సభ్యులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

- ఘనంగా రామనవమి ఉత్సవాలు



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలో గల భూమయోగేశ్వర ఆశ్రమంలో శ్రీరామ నవమి ఉత్సవాలు బుధవారం ఘనంగా కొనసాగాయి. ఆశ్రమ వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

వేల్పూర్: మండలంలోని రామాలయాలలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పూర్, పడగల్, అంక్సాపూర్, కోమన్‌పల్లి, పచ్చలనడ్కుడ రామాలయాలలో పూజలు, హోమం నిర్వహించారు.

- హనుమాన్ స్వాముల మండల భిక్ష



రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామంలో బుధవారం హన్మాన్ స్వాములకు మండల భిక్ష ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామంలో స్వాముల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిట్ల కృష్ణ మహారాజ్‌తో పాటు కందకుర్తి సీతారాం త్యాగి మహారాజ్‌లు పాల్గొని, మాట్లాడారు. దైవభక్తి వల్ల సన్మార్గంలో పయనిస్తారని, దుర్గుణాలకు దూరమవుతారని పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

- అయ్యప్ప గురుస్వాముల సమ్మేళనం



రుద్రూర్: కోటగిరిలో బుధవారం అయ్యప్ప గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీ క్షేత్రం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామీజీ హాజరై ప్రవచనం చేశారు. అయ్యప్ప స్వామి దీక్ష గూర్చి వివరించారు. కార్యక్రమంలో సమీప మండలాల గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

పెర్కిట్(ఆర్మూర్)/వేల్పూర్: ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, స్టేషనరి వస్తువులను అందజేశారు. వేల్పూర్ మండలంలోని పచ్చలనడ్కుడ పాఠశాలలో విద్యార్థులకు ఎస్వీ టెక్నాలజీ ప్రతినిధులు శ్రీమాన్, శ్రీధర్‌లు పరీక్షప్యాడ్‌లు వితరణ చేశారు.

పుస్తకావిష్కరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాటిక ప్రక్రియలో రాసిన ముచ్చట్లు అనే పుస్తకాన్ని అష్టవధాని, కవి గణపతి అశోక్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.

రైతుబీమా చెక్కు అందజేత

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో ఓ రైతు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి బుధవారం రైతుబీమా రూ.5లక్షల చెక్కును సర్పంచ్ చింత మల్లారెడ్డి అందజేశారు.

వైద్యుడిని నియమించండి

బోధన్: సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యుడిని నియమించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ బుధవారం కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

ఇసుక నిల్వను సీజ్ చేయాలి

రెంజల్(బోధన్): తన పొలంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేయాలని కందకుర్తి గ్రామానికి చెందిన ఆరీఫ్ బేగ్ బుధవారం తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన ఇమ్రాన్‌బేగ్ రాత్రి సమయంలో వాగు నుంచి ట్రాక్టర్ ద్వార ఇసుకను తీసుకవచ్చి నిల్వ చేస్తున్నట్లు వివరించాడు.

పశువులకు టీకాల పంపిణీ

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో పశువులకు లంపిస్కిన్ వ్యాధి నివారణ టీకాలను పశు వైద్య సిబ్బంది వేశారు. సర్పంచ్ ద్యాగ సరిన్, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

వేంపల్లిలో చలివేంద్రం ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఉప సర్పంచ్ జక్కగంగాధర్ ప్రారంభించారు. జీపీ కార్యదర్శి రాజ్యాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం..

బాల్కొండ: మండల కేంద్రంలో బుధవారం జీపీ ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహించారు. సంతకు రూ.6లక్షల 25వేలకు, రోజువారి మర్కెట్‌కు రూ.95వేలకు పాట పాడి దక్కించుకున్నారు. సర్పంచ్ బూస సునీత, ఉప సర్పంచ్ వాహబ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ సొసైటీ ఆధ్వర్యంలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. విండో చైర్మన్ అశోక్ పటేల్, బాన్సువాడ సెగ్మెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ సాయిబాబా, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అంబం (ఆర్), కొందాపూర్, రాయకూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం స్థానిక ప్రజాప్రతినిదులతో కలిసి బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇంచార్జ్ పోచారం సురేందర్ రెడ్డి భూమి పూజ చేశారు. సర్పంచ్ సర్పంచ్‌లు కొర్వ భాగ్య భూషణ్, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.